క్లుప్తంగా

ఆదిత్యునికి అభిషేకాలు


పూజలందుకుంటున్న సూర్యనారాయణుడు

పెందుర్తి: సుజాతనగర్‌లోని సూర్యనారాయణస్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున స్వామివారికి పంచ ద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ కమిటీ నూతన కార్యవర్గం


వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గం

పరవాడ: ఇ.బోనంగి శివారు ఫార్మాసిటీ కాలనీ కొండపై వెలసిన భూసమేత అభయ వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా బుగిడి రామగోవింద రావు, కార్యదర్శిగా లాలం అప్పలనాయుడు, కోశాధికారిగా పత్సమటల లోవరాజు, సభ్యులుగా గొర్లి కనకరావు, మేడిశెట్టి బాలాజీనాయుడు, రేలంగి ధనరాజు, సీహెచ్‌వీ సత్యనారాయణ, ఎంవీజీ రామశేఖర్, బొడ్డు అమరావతి, సాలాపు కేదారికనకసంతోషి(దీపిక)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సీతారాముల వార్షిక కల్యాణోత్సవం నేడు


అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: ఫాల్గుణ ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై గంగధార వద్ద ఉన్న ప్రాచీన రామాలయంలో సీతారాముల వార్షిక కల్యాణోత్సవ కార్యక్రమాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాయంత్రం అంకురార్పణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సీతారాముల వార్షిక కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

లక్ష్మీదేవికి అభిషేకాలు


అభిషేకాల్లో అమ్మవారు

పెందుర్తి: లక్ష్మీదేవి ఉత్సవాల్లో భాగంగా స్థానిక వేంకటాద్రిపై కొలువైన లక్ష్మి అమ్మవారికి తిరు నక్షత్రం సందర్భంగా ఆదివారం విశేష అభిషేకాలు జరిపారు. శ్రీసూక్త సహిత కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం గోత్రనామార్చన జరిపారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

14న సత్తమ్మతల్లి వార్షిక జాతర

సింహాచలం: అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తమ్మతల్లి వార్షిక జాతరను ఈ నెల 14న వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు తెలిపారు. అమ్మవారిని ఆదివారం దర్శించుకుని జాతర ఏర్పాట్లపై కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఆ రోజు అమ్మవారికి జరిగే వైదిక కార్యక్రమాలు, విద్యుద్దీపాలంకరణ, పుష్పాలంకరణ, సాయంత్రం జరిగే తీర్థమహోత్సవం నిర్వహణపై చర్చించారు. భక్తులు, ప్రజలంతా అమ్మవారి వార్షిక జాతర మహోత్సవం విజయవంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పి.వెంకటరావు, ఉపాధ్యక్షుడు గంట్ల కనకరాజు, సంయుక్త కార్యదర్శి బలిరెడ్డి శ్రీనివాసరావు, వ్యాపారవేత్త కృష్ణారెడ్డి, స్థానికులు స్నేతి మూలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వృద్ధురాలి ఆచూకీ లభ్యం


వృద్ధురాలిని అప్పగించిన పోలీస్

పెందుర్తి: సుజాతనగర్‌లో అదృశ్యమైన వృద్ధురాలి కేసును పెందుర్తి పోలీసులు గంటల్లోనే ఛేదించారు. చోడవరం మండలానికి చెందిన వృద్ధురాలు(80) సుజాతనగర్‌లోని మనవడి ఇంటికి ఆదివారం వచ్చింది. మధ్యాహ్నం బయటకు వెళ్లిన ఆమె, తిరిగి ఇంటికి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. తక్షణమే రంగంలోకి దిగిన పోలీసులు చినముషిడివాడ ప్రాంతంలో ఆమెను గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గుంతలే మిగిలాయి

- రూ. 1.43 కోట్లతో 22.23 కి.మీ. మేర మరమ్మతులు
- నాసిరకం పనులతో యథాస్థితికి ఆర్ అండ్ బీ రోడ్లు
- సబ్బవరం మండలంలో అధ్వానంగా రోడ్లు

ఛిద్రమైన రోడ్లను అభివృద్ధి చేయాల్సిన కూటమి ప్రభుత్వం ప్రతిపాదనలతోనే కాలయాపన చేస్తోంది. సంక్రాంతికి గుంతల్లేని రోడ్లుగా మారుస్తామని హామీలు, సూపర్ సిక్స్ మాదిరే ఆచరణకు దూరంగానే ఉన్నాయి. అరకొర నిధులు, అంతంత మాత్రపు పనులతో సరిపెట్టి, మిగిలిన వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేశాం, త్వరలోనే పూర్తి చేస్తామంటూ రెండు మాసాలుగా అధికారులు, కూటమి నేతలు నాన్చుతూనే ఉన్నారు. దీంతో సబ్బవరం మండలంలోని పలు గ్రామీణ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. గోతులు, రాళ్లు తేలిన రోడ్లపై వాహనదారులు అగచాట్లు పడుతున్నారు.

సబ్బవరం: గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు రోడ్లు దారుణ స్థితికి చేరాయి. అధ్వాన రోడ్లను అభివృద్ధి చేస్తామని ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వ సంక్రాంతి టార్గెట్ ఎప్పుడో వెళ్లిపోయింది. కొన్ని రోడ్లకు ప్యాచ్ వర్క్‌లు చేపట్టి, మిగిలిన రోడ్లను ప్రతిపాదనలకే సరిపెట్టారు. మండలంలో 11 ఆర్ అండ్ బీ రోడ్లు ఉన్నాయి. వీటిలో 9 రోడ్లకు రూ.1.42 కోట్లతో 22.23 కి.మీ. మేర మరమ్మతులు చేపట్టారు. అవి కూడా నాసిరకం ప్యాచ్ వర్క్‌లే. దీంతో మూణ్నాళ్లకే చాలా చోట్ల రోడ్లు యథాస్థితికి చేరాయి.

ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో..

ఎన్టీపీసీ రోడ్డు అభివృద్ధిలో భాగంగా ఇటీవల రోడ్డుకు మరమ్మతులు చేపట్టేందుకు ఆ సంస్థ సీఎస్సార్ నిధులు రూ.70 లక్షలు కేటాయించింది. దీంతో అధ్వానంగా ఉన్న రోడ్డులో గోతుల్ని పూడ్చి


అడుగడుగునా గోతులతో అంతకాపల్లి-రావలమ్మపాలెం రోడ్డు

మరమ్మతులు చేపట్టారు. అయినప్పటికీ కొన్నాళ్లకే రోడ్డుపై రాళ్లు లేచి, దుమ్మూధూళి కమ్మేస్తోంది. పూర్తి స్థాయిలో నిధులు కేటాయించి రోడ్డును అభివృద్ధి చేస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని స్థానికులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


వంగలి మారిటైం విశ్వవిద్యాలయం ఎదురుగా దెబ్బతిన్న రోడ్డు

భారీ వాహనాలతో గోతులు

సబ్బవరం-చోడవరం రోడ్డు నుంచి రాయపుర అగ్రహారం మీదుగా మారిటైం, పెట్రో వర్సిటీలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ప్రస్తుతం విశ్వవిద్యాలయాల్లో భవన నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో నిర్మాణ సామగ్రితో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. పలు చోట్ల పెద్ద పెద్ద గోతులతో వాహనాలు అదుపుతప్పి, ప్రమాదాల బారిన పడే అవకాశం అధికంగా ఉండటంతో వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు.

రాళ్లు తేలి.. దుమ్ము రేగి

మండలంలోని అసకపల్లి-లంకెలపాలెం రోడ్డు నిత్యం భారీ వాహనాల రాకపోకలతో తీవ్రంగా దెబ్బతింది. రోడ్డుపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడటంతో భారీ వాహనాలు గోతుల్లోపడి చాలాసార్లు రోడ్డు మధ్యలో నిలిచిపోయాయి. భారీ వాహనాలతో రోడ్డు పొడవునా ఉండే అసకపల్లి, ఎరుకునాయుడుపాలెం, పైడివాడ అగ్రహారం తదితర గ్రామాలపై బూడిద అలముకుంటోంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అవరోధంగా మారుతోంది.


అసకపల్లి రోడ్డులో వాహనాల రాకపోకలతో ఎగసిపడుతున్న ధూళి

బీటీ రోడ్డుకు గ్రావెల్ పూత

సబ్బవరం-గుల్లేపల్లి రోడ్డులో అంతకాపల్లి, రావలమ్మపాలెం వెళ్లే వరకు రోడ్డు అధ్వానంగా మారింది. అడుగడుగునా గోతులు, గుంతలే. దీంతో వాహన చోదకులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుచోట్ల బీటీ రోడ్డుకు గ్రావెల్‌తో పూడ్చి, ఆయా గ్రామాల వాసులు నెట్టుకొస్తున్నారు.


బీటీ రోడ్డుపై గ్రావెల్‌తో ప్యాచ్ వర్కులు చేసి వదిలేసిన అసకపల్లి-లంకెలపాలెం రోడ్డు

అధికారులు చొరవ చూపాలి



ఆరిపాక-వంగలి యూనివర్సిటీలకు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ప్రస్తుతం వాహనాలతో రద్దీగా ఉండే ఈ రోడ్డు శిథిలావస్థకు చేరడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. భారీ వాహనాలు తరచూ నిలిచిపోతుండటంతో రద్దీగా మారుతున్నాయి. అధికారులు చొరవ తీసుకుని రోడ్డును అభివృద్ధి చేయాలి.

– కోన నాగరాజు, రాయపుర అగ్రహారం

అడుగడుగునా గోతులు



గుల్లేపల్లి-సబ్బవరం రోడ్డు నుంచి అంతకాపల్లి, రావలమ్మపాలెం వెళ్లే రోడ్డు అడుగడుగునా దెబ్బతిని గోతులు, గుంతలు దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్డు మీదుగా రాకపోకలు సాగించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే పరిసర గ్రామాల ప్రజలతోపాటు, వాహనదారులకు ఉపయోగం.

– మేరపురెడ్డి నారాయణమూర్తి, రావలమ్మపాలెం

నిధులు వచ్చాక మరమ్మతులు



మండలంలో 9 రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.1.43 కోట్లతో 22.23 కిలో మీటర్ల పొడవున రోడ్లకు మరమ్మతులు చేపట్టాం. మండలంలో మిగిలిన రోడ్లను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. నిధులు విడుదలైన వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపడతాం.

– బాలరాజు, ఆర్ అండ్ బీ జేఈ, సబ్బవరం మండలం

పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా జడ్జి శ్రీ విద్య

పరవాడ: పోక్సో చట్టంపై అవగాహన పెంచుకుని, లైంగిక దాడుల నుంచి రక్షణ పొందాలని అనకాపల్లి ఎంఎల్ఎస్‌సీ, పూర్వ అడిషినల్ జిల్లా జడ్జి ఎస్.శ్రీవిద్య సూచించారు. తానాంలోని మహాత్మ జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల పాఠశాల, జూనియర్ కళాశాలలో హైకోర్టు ఆదేశాల మేరకు పోక్సో చట్టంపై ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పోక్సో చట్టంలోని ప్రధాన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుహాసిని, జి.రేష్మాపల్లవి, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, పోలీస్ స్టేషన్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడి కాలుష్యంపై సీపీఎం అధ్యయన యాత్ర


తాడి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నేత శంకర్రావు

పరవాడ: కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించి, ప్రజలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రుత్తల శంకర్రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రామంలో సీపీఎం నేతలు ఆదివారం అధ్యయన యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యం వల్ల ప్రజలు కిడ్నీ, చర్మ, ఊపిరితిత్తులు, క్యాన్సర్, ఎముకలు, నరాల బలహీనత, కంటి సమస్యలతో బాధపడుతున్నారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించడానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు సోమవారం గ్రామాన్ని సందర్శించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, నేరుగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, కండిపల్లి అప్పలరాజు, లక్ష్మి, పార్వతి, అప్పల నరసింహం పాల్గొన్నారు.

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం

- రెవెన్యూ అధికారుల గైర్హాజరుపై ఎంపీపీ అసహనం
- పంచాయతీల విద్యుత్ బకాయిలు చెల్లించాలని ఏఈ వినతి


మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

పెందుర్తి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో పలు అంశాల్లో ఎంపీపీ మధుపాడ నాగమణి సంబంధిత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి రెవెన్యూ శాఖ నుంచి ప్రాతినిధ్యం లేకపోవడంతో ఎంపీపీ సహా పలువురు ప్రజాప్రతినిధులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్రమ క్వారీ తవ్వకాలు, భూ ఆక్రమణల గురించి ఎవరికి ఫిర్యాదులు చేయాలని ప్రశ్నించారు.

- గ్రామ పంచాయతీల నుంచి విద్యుత్ బకాయిలు ఉన్నాయని ఏఈ రవికుమార్ తెలిపారు. ఆయా బకాయిలు తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో కొల్లి వెంకట్రావుకు ఆయన విన్నవించారు.
- మండలంలో జరుగుతున్న జగనన్న లేఅవుట్‌లలో నిర్మాణాలు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని, లేకపోతే బిల్లులు విడుదల కావని ఆ శాఖ అధికారులు స్పష్టం చేశారు.
- పంచాయతీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీ నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు కోరారు. పలు అంశాలపై తీర్మానాలు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


స్వామికి స్వర్ణపుష్పాలతో అర్చన చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో అష్టోత్తరశతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేష వస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి, కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

కోడి పందాల శిబిరంపై దాడి

పోలీసుల అదుపులో నలుగురు


పట్టుబడ్డ వారితో పోలీసులు

పరవాడ: తాడి గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందాల స్థావరంపై పరవాడ పోలీసులు ఆదివారం దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ముందుగా అందిన సమాచారంతో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆదేశాల మేరకు తాడి గ్రామ సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్న స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో సేనాపతి పైడినాయుడు(మడకపాలెం), వీరేసు అప్పారావు(తానాం), వంజర శ్రీనివాస్(లంకెలపాలెం), లాలం అప్పారావు(పరవాడ)లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3 పందెం కోళ్లు, రూ.5,800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.కృష్ణారావు తెలిపారు. ఈ దాడిలో ఏఎస్ఐ బీవై నాయుడు, హెచ్‌సీ సాయికుమార్, పీసీ జి.సన్యాసినాయుడు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలే గతి


కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్ఐ అసిరితాత

పెందుర్తి: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే జైలుపాలు కావాల్సి వస్తుందని సబ్ ఇన్‌స్పెక్టర్ అసిరితాత రౌడీ షీటర్లను హెచ్చరించారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు సీఐ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఆదివారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చెడు ప్రవర్తన వలన తమ కుటుంబాలు సమాజంలో చిన్న చూపునకు గురవడంతోపాటు, ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మంచి నడవడికతో ఉంటే రౌడీషీట్‌లు ఎత్తివేయడానికి ఉన్నతాధికారులు ఆలోచన చేస్తారని పేర్కొన్నారు. ఈ మేరకు వారికి పలు సూచనలు చేశారు.

వైభవం.. ఆలయాల ప్రారంభోత్సవం


సబ్బవరంలో కొలువైన ఉమా రామలింగేశ్వరస్వామి


విద్యుత్ దీపాలతో శోభాయమానంగా ఉమా రామలింగేశ్వర ఆలయం


గుల్లేపల్లి కోదండ సీతారాముల సన్నిధిలో గుడివాడ అమర్‌నాథ్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తదితరులు

సబ్బవరం: మండల కేంద్రం సబ్బవరంలోని ఉమా రామలింగేశ్వరస్వామి, గుల్లేపల్లిలోని కోదండ సీతారాముల ఆలయాల కలశ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రారంభోత్సవ కార్యక్రమాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా ఆదివారం వేకువజాము నుంచి వేద పండితుల మంత్రోచ్ఛారణలతో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన చేపట్టారు. ఆలయం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వామివారి ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆలయ ప్రారంభోత్సవంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీతో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.

- గుల్లేపల్లి కోదండ సీతారాముల ఆలయ పసిడి కలశ ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆలయ ధర్మకర్త బోకం రామునాయుడు ఆధ్వర్యంలో వైభవంగా జరిగింది. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయం వద్ద భారీ అన్నసమారాధన జరిగింది. ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా మూడు రోజులు నిర్వహించిన కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వామిని దర్శించుకున్నవారిలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు గండి రవికుమార్, బండారు శ్రీను, పార్టీ మండల కన్వీనర్ కర్రి బాబు, పెందుర్తి ఎంపీపీ మధుపాడ నాగమణి, మాజీ జెడ్పీటీసీ కొటాన రాము, బోను గంగునాయుడు, పాలిశెట్టి సురేష్‌రాజ్, నేబర్తి శ్రీను, కోన సంజీవరావు, కాపుశెట్టి శేషుబాబు, వడ్డాది అప్పలరాజు, వనం అచ్చెన్నాయుడు, దొడ్డి కిరణ్ తదితరులు ఉన్నారు.

నేడు కోదండ రామాలయ ప్రారంభోత్సవం



పెందుర్తి: మండలంలోని దువ్వపాలెంలో నూతనంగా నిర్మించిన సీతా సమేత కోదండ రామాలయాన్ని సోమవారం శాస్త్రోక్తంగా ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఉదయం 9.22 గంటలకు రామ, సీత, లక్ష్మణ, ఆంజనేయ, వినాయక, సరస్వతీదేవి విగ్రహాల ప్రతిష్ఠ జరగనుందన్నారు. అనంతరం విశేష పూజలు జరపనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కోరారు.

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తులు


దరఖాస్తులు నింపుతున్న ప్రజలు

పెందుర్తి: కూటమి ప్రభుత్వం ప్రకటించిన పట్టణంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు ఇంటి స్థలాల కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకుంటున్నారు. సీపీఐ ఆధ్వర్యంలో పెందుర్తి, అయ్యప్ప కాలనీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వందలాది మంది దరఖాస్తులు నింపారు. ఆయా దరఖాస్తులను సోమవారం రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌కు అందించనున్నట్లు సీపీఐ నాయకులు ఆర్.శ్రీనివాస్, వై.రాంబాబు తెలిపారు.

అలరించిన చిడతల భజన పోటీలు


ఆకట్టుకున్న చిడతల భజన

పరవాడ: స్థానిక పైడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పండగ తొలి రోజున జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆహ్వాన చిడతల పోటీలు అలరించాయి. ఈ పోటీలను తిలకించేందుకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, ఉప సర్పంచ్ బండారు రామారావు, పెద్దలు రెడ్డి శ్రీనివాసరావు, పైల రామచంద్రరావు, ఆర్.అక్కునాయుడు, పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు తిలకించారు.

టెన్త్ విద్యార్థులకు ఘన వీడ్కోలు


నృత్యం చేస్తున్న విద్యార్థులు

పెందుర్తి: సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఆదివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు సరస్వతీదేవి పూజ ఘనంగా చేశారు. అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఆడిపాడి సందడి చేశారు. ఈ సందర్భంగా పాఠశాల నార్త్ ఆంధ్ర జోనల్ ఇన్‌చార్జి ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ రానున్న పరీక్షల్లో విద్యార్థులంతా అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. జీఎం కె.రమ్య, ప్రిన్సిపాల్ స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.